# సీతాలు జడుసుకున్నది-

**పూసపాటి కృష్ణంరాజు**

చెరువుమీద పాకలో దాచుకున్న తాటి బుర్రికలను అంబటి తట్టలో పేర్చుకుని 'పొద్యేళ్' అయిపోయిందని సీతాలు ఊరు ముఖం పట్టింది.

పొలంగట్లు దాటి చెరువుగట్టు చేరుకుంది. గట్టుమీద హాయిగా పెరిగిన తాటిచెట్ల మధ్య నడుస్తోంది. కట్టుకున్న ఎఱ్ఱగోక గాలికి రెపరెపా కొట్టుకుంటోంది. పొద్దుగూకి పోయింది. అపరసంధ్యదూరంగా గ్రామాల్లో ఇళ్ళమీద పొగసుళ్ళు తిరుగుతో కనుపిస్తోంది.

చెరువుగట్టు దిగితే వల్లకాడు. వల్లకాట్లో చెట్లు దెయ్యాల్లా విరబోసుకుని కనిపిస్తున్నాయి. కాటి మధ్యనుంచే ఊరికి దారి!

ఆశ్మశానంలో యీ మధ్య అఘోరీ తిరుగుతున్నాడన్న మాట సీతాలుకి గుర్తొచ్చింది. శవాలను తినేవాణ్ని తలచుకుని వణికిపోయింది.

గబగబా అడుగులు వేస్తోంది. నెత్తిని అట్టెభారం లేకపోయినా అలవాటు చొప్పున వూగుతోనే వుంది. కాళ్ళ మట్టెలు కంకర రాళ్ళమీద చిటుకూ-చిటుకూమంటున్నాయి. పైట చెంగు సర్దుకున్నప్పుడల్లా గాజులు గలగల్లాడుతున్నాయి. తాటికమ్మలు గాలికి టపటపా కొట్టుకున్నాయి. పోతుచెట్టు వేసిన పన్నా రాలి సీతమ్మకు రెండుమూడు గజాలదూరంలో "టప్"మని పడింది.

సీతమ్మ నెత్తిమీద ఊరంతగంప. తలఎత్తి చూడగలదా ఏమన్నానా? అఘోరించినట్టే వుంది. అఘోరీలకు దిక్కూ-మొక్కూ లేదా!

సీతాలు వళ్ళంతా గగుర్పొడిచింది. భయంతో గుండె గొంతుకలో కొచ్చి కొట్టుకున్నది. ఒక్కక్షణం కదలలేకపోయింది; నిలుచున్న సీతాలు నిలుచున్నట్టే వుండి గుక్క తిప్పుకుని మళ్లా కదలిపోయింది.

అడుగులు మహావేగంగా పడుతున్నాయి. కష్టంలో నడుస్తున్నప్పుడు తోజు పరిగత్తడమే.

"దానిజిమ్మడ తాటెన్నకాదు గాని, ఎంత పాలొచ్చింది!" అనుకుంది సీతాలు.

"తోడవురా నేకుండా పొక్కర్తివే పోగలవటే సీతాలూ! అని పెద్దన్న అడుగుతే,

"ఎందుకు నేరా తోజా నడిసీతో వేగడా" అంది అఘోరీల మాట మరచిపోయి. ఇప్పుడు గట్టి-చిక్కు వచ్చింది. అనుకున్నంత పనీ ఐయింది. ఈ భయం ఎక్కడనుండో వచ్చి



జారింది. సీతాలు చెట్లమధ్య బాట ననుసరించి పరిగెత్తుతోంది.

"సీతా! సీతా!" సీతాలుకు ఎక్కడిదో పిలుపు వినిపించింది.

"సీతా! సీతా! ఒకచిటం ఆగవూ?" ఎవరో పిలచేరు. అడుగు ముందుకి పడలేదు. ఆగిపోయింది.

"సీతా! సీతా! నువ్వోకసారి యిటు చూడవూ?" సీతాలి కేమీతోచలేదు.

"సీతా! సీతా! యిటు, యిటు, యిటు చూడవూ?" అని పిలుపు లొచ్చేయి. సీతమ్మ తట్టెడు తాటిబురికెలూ గుభుక్కున ఎత్తేసింది. శ్మశానం నిండా తాటిబురికెలు పరుగులెత్తేయి. మూసినకళ్లు తెరచి నాలుగుప్రక్కలా చూసింది. ఎవరూ కంటికెక్కనరాలేదు. దూరంగా ఊరుమాత్రం కనిపిస్తోంది. కుక్కలు అరుపులు మాత్రం వినిపిస్తూన్నాయి. నక్క మూలిగింది. మరికొన్ని నక్కలు సంగీతానికి లంకించుకున్నాయి.

తిరుగులేదు. అది అఘోరీల పిలుపే. ఒళ్ళంతా నీరిడిసిపోయింది. పరుగెడదామనుకుంటే, కాళ్లు కదిలిరావడం లేదు. కేకలు వేద్దామనుకుంటే గొంతుకెండిపోయింది. నోరు పెగల్డంలేదు.

"సీతా! సీతా! యిటు చూడవూ?" ఎక్కడిదో వినిపించింది. సత్తువంతా తెచ్చుకుని ఒక్కబిగిని కాలు కదిపింది. పరుగులో భూమి కనుపించడం లేదు. ఆ పరుగులో పేగులు తెగిపోయినట్టయింది. కసివిందమొక్కలు రెండుకాళ్లకూ చుట్టుకున్నాయి. సీతాలు కొట్టినచెట్టులా కూలిపోయింది.

పశువుల సంతనుండి చేరగాళ్ళు ఇళ్లకు తిరిగొస్తున్నారు. మండల చిన్నాయ పరధ్యానంగా కాట్లో ఏదో కదలం చూసేడు ఎర్రకోక మాత్రం అనింది. అతనికి దెయ్యాల్లి



# ★ సీతాలు జడుపడ్డది ★

అంటే వల్లమాల్ని భయం. కాలు కదలకుండా కట్టడుపోయింది.

"ఏందిర సిన్నయ్య మావా! ఆగిపోనావు?" అని అడిగేడు పిసినెర్రాయ.

"ఓరయ్య దెయ్యంరా!" అన్నాడు చిన్నాయ.

"ఓరలెయ్. దెయ్యం లేదు, గియ్యం లేదు. నీ పిళ్లైదాన్నిగలా" అన్నాడు ఎఱ్రాయ.

"భగమంతునిమీన సాచ్చిగా, నాకళ్లతో నాను శూస్తే నువ్వు దవాయించేస్తావేంది తయ్యా?" అడిగేడు చిన్నాయ.

"నువ్వు నూసిందేటిది మావా?" అడిగేడు కిష్టమ్మ.

"ఎఱ్రగా పట్టుగోక సుట్టుకుని, జామ్మని పొరొచ్చి ఆ కసివింద మొక్కలకాడ మాయిపైపోనాది—అదేటిదో గాని—మన కెందుకు లే, యీ దార్ని పోదాం రంజేస" అన్నాడు చిన్నాయ.

"పోనియ్యేయ్; యీడియ్యన్నీ వచ్చి కోతలు" అన్నాడు కిష్టమ్మ.

"నిబద్దిగే సేయ్. భూదేవి సాచ్చిగా—పంటేళకాడ నాకెందు కబద్దమాడాల?" అన్నాడు చిన్నయ.

"పదం జేస. దెయ్యం అక్కడేంచేస్తాయ ఉన్నాదో నూద్దాం," అని ముందుకొచ్చేడు ఎఱ్రాయ.

"వల్లకొండేయ్ మనకెందుకొచ్చింది జెయ్యాలూసు. నాన్రాలేనోరయ్యా," అన్నాడు చిన్నయ్య.

"పదేస. మనిద్దరం ఎల్లి నూద్దాం," అని కిష్టమ్మ దారితీసేడు. ఎఱ్రాయ అడుగు ముందుకు వేసేడు. చిన్నాయ ఒక్కడూ వుండలేక వాళ్లతో అంటిపెట్టుకుని వెళ్లేడు. కసివింద మొక్కలమధ్య ఎఱ్రగా కనుపించింది.

"అదేటిదా గుడ్డముక్కానాగుందేయ్" అన్నాడు కిష్టమ్మ.

"గాతలో దిగింతరవాత అదేటిదైతే మన కేటి! పదంజేస," అని ముందుకు తోచుకొచ్చేడు ఎఱ్రాయ. సీతాలు కొద్దిగా కదిలింది. మూలిగిందికూడాను. కిష్టమ్మదగ్గరగా వెళ్లి ముఖంలో ముఖంపెట్టి చూసేడు. సీతాలుని అంతా పోల్చుకున్నారు.

"ఈర్నాయుడి కూతురు సీతాలేనేయ్. ఏటిలా పడిపోనాదో," అన్నాడు కిష్టమ్మ ఆశ్చర్యంతోనూ, విచారంతోనూను.

"కళ్ళంనుండొస్తూ తోట్లో జడుపడింది గావోలు. పాఱ్రాబోనాది. పడిపోయి ముందు వాకంటికానింది. నానేవొదెయ్యి వనుకున్నా. గుండెల్నీరిడిసిపోనాయి. సెగదీయంజేయ్ గుంటపాపని," అన్నాడు చిన్నాయ.

సీతాలు లేచింది.

ముఖంమీద చల్లడానికి నీళ్ళయినా లేవు. దట్టిగడతో ముఖంమ్మీద విసిరేరు. సీతాలు కళ్ళు విప్పింది. కంటిముందు తెలిసిన నలుగురు మనుషులూ కనిపించేరు. కోలుకుంది. సీతాలు లేచి నిలుచ్చుంది. విడిపోతున్న కోక కుచ్చెళ్ళను పొత్తికడుపులో దోపుకుంది. జారినపైటచెంగు సరిదిద్దుకుంది. వంట్లో దిమ్ముగావుంది.

సీతాల్ని తీసుకుని ఊరు చేరుకున్నారు. ఈర్నాయుడి ఇంటిముందు వాడవాడంతా చేరుకుంది. "సీతాలు వల్లకాట్లో సొమ్మసిలి పోనాదంటే, సొమ్మసిలిపోనా"దని, ఊరంతా చిటికలో పాక్కపోయింది.

సీతాలు ఇంటికిరాగానే మళ్లా మూర్ఛపోయింది. పొలంలోవున్న మొగవాళ్ళ నలుగురికీ కబురందింది. రెక్కలు కట్టుకొచ్చి యింటిదగ్గర వాలేరు.

సీతాలు మొగుడు సిరిపురం రావులు

ముఖంలో కత్తికోసింది. రక్తపుచుక్క కరువయింది.

పోయిన వేసవిలో సిరిపురం బొట్టెడినీ—సీతాల్నీ కలిపేరు. యీర్నాయుడు అల్లుణ్ణి యిల్లరికం పెట్టుకున్నాడు. సీతాలు కడుపున ఓపండు పండకుండానే, జీవితం చాలించి వెళ్లిపోయేడు. తండ్రిమాట నిలబెట్టి అన్నదమ్ములిద్దరూ సీతాల్నీ, సిరిపురం బొట్టెడినీ కలిసికట్టుగా చూసుకుంటున్నారు. అంతా ఒక్కతాటిమీద బ్రతుకుతున్నారు. పండినగింజలు దాచుకుని, ఎప్పుడూ కమ్మని వరికూడు తింటూ, ఊళ్ళో అవుననిపించుకుని, గోటుగా బతుకొస్తున్నారు. పేట పేటంతటికీ రావులు సిరిపురంబొట్టెడు—సీతాలు సిరిపురం నాయరాలూనూ. బావా, చెల్లెలూ అంటే అన్నదమ్ములకీ—అమ్మకీ కొండంత తనివి.

సీతాలు నట్టింట నులకమంచంమ్మీద కాలిపోతూంది. వంటిమీద స్మారకం లేదు.

పేటపేటంతా తిరగబడి చూసేరు. గాలి సోకిందంటే, గాలిసోకిందని అంతా అన్నారు. పూజారి వెంకయ్యాని పిలుచుకొచ్చేరు.

వెంకయ్య వేపకొమ్మలు విరుచుకు రమన్నాడు. కర్రికోడిపిల్లను కడిగి పసుపూ బొట్టూ పెట్టేడు. కడవతో కడివెడు నీళ్ళూ నెత్తిమీద దిమ్మరించుకుని, సిగముడి విప్పి, జుత్తులన్నీ జారవిడుచుకుని, రూపాయంత కుంకుమబొట్టు పెట్టుకుని, కాలభైరవుళ్ళా తయారయ్యేడు.

రెండు కాళ్ళకూ ఆల్చిప్పలూ, గవ్వలూ కట్టుకుని, ఒకచేత్తో వేపరెమ్మల్నీ మరోచేత్తో కోడిపిల్లనీ పట్టుకుని, "హూం! హ్రీం! హోం! ధూం!" అని అరచుకుంటూ తెంపులేకుండా, సీతాలి మంచంచుట్టూ ప్రదక్షిణాలు చేసేడు. అంతా కిక్కురుమనకుండా కళ్ళప్పగించి, చూస్తూ కూచున్నారు. సీతాలు పాదాలవైపు నిలుచుని పూజారి వెంకన్న నోరు బారజాపి, కోడిపిల్ల గొంతుకముడిదగ్గర పళ్లతో ఒక్కకొరుకు కొరికేడు. కోడిపిల్ల కాళ్ళూ రెక్కలూ కొట్టుకుంది. సీతాలు ఉలిక్కిపడి అటూ ఇటూ పత్తిగిల్లింది. పూజారి వంటినిండా కోడిరక్తం చిమ్మని చిలకరించింది.

"అమ్మికి గాలిసోకింది. సోకిన గాలిని సాగబెట్టేను. పొద్దెక్కితే పిల్ల తిరుగుడుద్దినే," అని చెప్పి పూజారి కోడిపిల్లనీ, పూజకట్నాన్నీ పట్టుకుని వెళ్ళిపోయేడు.

తెల్లవారూ సతాలు పలవరిస్తూనే వుంది.

"ఒగ్గిరా! నన్నొట్టుకోకురా! యిదమ్మాల్నోడా! గుడిశేటోడా! ఒగ్గిరా! నన్నొట్టుకోకురా" అని ఒకటే రొద. దాని తత్వం ఎవరికీ బోధపడనేలేదు.

ఊరంతా వుడికిపోయింది. "పైడితల్లమ్మోరు సీతాల్నొట్టుకుంది. ఆ మ్మోరి


## మీ అబ్బాయి చదువు

మీ అబ్బాయి చదువును ఎ. ఎస్. మూర్తి, ఎం. ఏ. వ్రాసిన విద్యాదర్శిని అనే పుస్తకం చదివి నిర్ణయించండి. అందులో 32 రకాల యింజనీరింగు చదువులు, 84 రకాల వృత్తి చదువులు, 20 రకాల డాక్టరు చదువులు, వీటికి హైస్కూలు చదువునుంచి తీసుకోవలసిన జాగ్రత్తలు, హైస్కూలు చదువు అవగానే కాలేజి చదువు అవసరం లేకుండా డబ్బు సంపాదనకు పనికివచ్చే ఎన్నో యితర చదువులు మన దేశంలోని రకరకాల కాలేజీలు, వాటి ఎడ్రసులు, వాటిలో చెప్పే చదువులు, వాటికి అయ్యే ఖర్చులు, విదేశ చదువుల వివరాలు, స్కూలు ఫైనలు తప్పినవారికి మంచి భవిష్యత్తునిచ్చే చదువులు, ఇలా పిల్లల చదువులకు సంబంధించిన అన్ని వివరాలు విద్యాదర్శినిలో ఉన్నాయి. చదువుకొనే పిల్లలున్న ప్రతివారికి యీ పుస్తకం చాలా అవసరం. 320 పేజీలు. వెల వి. పి. పోస్టు ఖర్చుతో రు. 5. ఇదీక్రింది చోటనే దొరుకును. మూర్తి & [illegible], 88, పీటర్సురోడ్డు, మద్రాసు-14 అనే అడ్రస్సుకు మీరుకూడా ఒక పుస్తకం వి.పి.పోస్టుద్వారా వెంటనే పంపించమని ఒక ఉత్తరం వ్రాయండి.

SWASTIK

కాగ్రహం వొచ్చింది," అన్నమాట గడప గడపకీ ప్రాకిపోయింది. ఊళ్ళో పెద్దలంతా కలసి, వచ్చేమంగళవారం అమ్మవార్ని తేవాలని, గ్రామదేవత పండుగ చెయ్యాలనీ తీర్మానించుకున్నారు. వెంటనే ఊరు బారికచేత ఆమాట దండోరా వేయించేరు.

యీర్నాయుడి ఇంటిల్లిపాదికీ వుపోషమే. సంధ్యవేళ కూటికుండ వుడకలేదు. తెల్లవార్లూ పెద్దన్నా, చిన్నన్నా, అమ్మా, సిరిపురం రావులూ సీతాలి మంచంచుట్టూ జాగరంకూర్చున్నారు. సీతాలూ తెల్లవార్లూ పలవరిస్తూ తెల్లవారుజామున కళ్ళుమూసింది.

ఆ మూసినకళ్ళు మరితెరవలేదు. ఊరంతా తెలవారిపోయింది. ఆ ఇంటిని కన్నతల్లి కంబెలెత్తిపోయింది. సిరిపురంబొట్టెడికి మనసు మనసులోనే లేదు.

గణాచారికి అమ్మవారు పట్టి వూగింది. సీతాలి శవందగ్గర కూర్చుని పతి చెప్పింది. సీతాలు ప్రాణాలు పోలేదనీ, సీతాలు బ్రతికి మనందర్లోనూ తిరుగాడుద్దనీ. సీతాలు శవం వల్లకాట్లో తగలబెటకూడదనీ – భూస్థాపితం చెయ్యాలనీ, సీతాలు భూమిలో కూర్చుని తిరిగొస్తుందనీ, సీతమ్మవారి పుట్టిల్లు భూదేవి కడుపనీ, పట్టుపట్టింది. అమ్మవారు పలికింది; గణాచారి గంగమ్మ చెప్పినట్టూ చెయ్యాలని ఊరంతా తీర్మానించేరు. సిరిపురంబొట్టెడికి అదే మంచిదనిపించింది.

కోనేటినుండి కడవల్తో నీళ్ళు తెచ్చి, సీతాలు శవంమీద నీళ్ళుపోసి, కొత్తకోక కట్టి, పసుపూ కుంకుమా పెట్టి పేరంటాల్ని చేసేరు.

పునిస్త్రీ సీతాల్ని వల్లకాట్లో భూస్థాపితం చసేరు. అంతా తిరిగొచ్చినప్పుడు దార్లో నూతిదగ్గర నీళ్ళుపోసుకుని, ఎవరి కొంపకు వాళ్ళు చేరుకున్నారు.

ఈర్నాయుడి ఇంట్లో మహాలక్ష్మి వెళ్ళిపోయింది. ఇల్లంతా బేపురుమనుంది. కావలసిన వాళ్ళంతా తొంగిచూసి వెళ్ళిపోయేరు. చీకటిపడింది. పెద్దన్నా — సిరిపురం బొట్టెడూ చీకట్లో నట్టొకట కూర్చున్నారు. గ్రామం యావత్తూ చీకట్లో చింగులు తొక్కుతోంది.

"పెదబావా! గణాసారి సెప్పినట్టు సీతాలీకి యీ రేత్తిరి తప్పక జీవాలొస్తాయి కదూ?" అన్నాడు రావులు.

"అదే నాకూ అనిపిస్తుందయ్యా" అన్నాడు పెద్దయ్య.

"జీవాలొచ్చినోపుని ఏ అఘోరీగోడో తవ్వుకు తినేస్తాడేటో. నా నెళ్ళి కాపుంటాను," అని సిరిపురంబావ లేచేడు. సిరిపురం బొట్టెడు ఆగేటట్టు లేడు. అఘోరీల మాట పెద్దయ్యకుకూడా జ్ఞాపకం వచ్చింది. "నానూ వొస్తాను పద," అని పెదబావ లేచేడు. చూరునున్న వేటకత్తిని భుజం మీద వేసుకుని పెదబావా సిరిపురంబావా వల్లకాటి దిబ్బ తొక్కేరు.

చీకట్లో చెట్లమీద సిమ్మెట్లూ, చింతపురుగులూ సంగీతం పాడుకుంటున్నాయి. పెద్దయ్యా, బావమరదీ వల్లకాటి మఱ్ఱిచెట్టు కింద కూర్చున్నారు.

ఊళ్ళో కుక్కలు నోరుపీకి అరవడం మానుకున్నాయి. కాట్లో కాలుతోన్న కొరివి దుక్కలు నిప్పుల్ని విరజిమ్ముతున్నాయి. చీకటి జిమ్మని గీపెడుతోంది. దూరంగా బీడుమీదా చెరువుగర్భంలోనూ అరగడిలోనూ రేగటిమీదా కొరివిదెయ్యాలు పుడుతున్నాయి. సీతాలు గుట్టిపాలైన స్థలం వాళ్ళకట్టే దూరంలేదు. అంతా మసకమసకగా కనిపిస్తోంది.

సిరిపురంబొట్టెడూ పెద్దయ్యా చెట్టుకింద కదలకుండా కూర్చున్నారు. ఇద్దరి దృష్టీ సీతాల్ని పాతిపెట్టిన గోతివైపే వుంది. అప్పుడప్పుడు ఒకర్నొకరు చూసుకోవడం తప్ప ఉలుకూ పలుకూ లేదు.

వుండివుండి నక్కలు బేంకు వాయిద్యం వినిపిస్తున్నాయి. గుడ్లగూబ సెత్తిమీద ఎగురుతోంది. బండిపులుగుపిట్ట అచ్చంగా మనిషిలాగే ఒకప్పుడు మాలుగూ, మరోసారి ఏడుపు, ఇంకోసారి కేకలూ, నవ్వులూ, కేరింతాలూనూ. పెద్దయ్యకూ, రావులుకూ ఈ అరుపులేం చెవికి పట్టడంలేదు. ఇద్దరి దృష్టీ సమాధిమీదనే నిలచిపోయింది. పెద్దయ్య చుట్టపొగలో తిరుగుతోన్న సుళ్ళు కనుపించడంలేదు. అలసిపోయిన ప్రాణాలు అప్పుడప్పుడు మొగన్నున పడుతున్నాయి.

ఆకాశంలో మబ్బులు అక్కడక్కడ బల్లకట్టుగా వున్నాయి. చుక్కలు మసక మసకగా కాలిపోతున్నాయి. మూడుఝాముల రాత్రి మురిగిపోయింది.

నిద్దట్లోవున్న పెద్దయ్యమీద గుడ్లగూబ వాలింది. వులిక్కిపడి లేచేడు. సీతాలి సమాధివైపు దృష్టిపోయింది. సమాధి దగ్గర మనిషి! అఘోరీ! సీతాల్ని తవ్వుకుపోయి పీక్కుతిందామనుకుంటున్నాడు. చెయ్యి కదిలింది. చేతికి వేటకత్తి తగిలింది. లేచి సమాధివైపు పరిగెత్తేడు. పెద్దయ్య నరాలన్నీ సుళ్ళు తిరిగిపోతున్నాయి. వుగ్రుడైపోయేడు. కన్నూమిన్నూ కానరాలేదు. వేళుతూనే వేటకత్తి గురిచూసి ఎదుటి మనిషి భుజాల మధ్యకు విసిరేడు. 'అఘోరీ' పనైపోయింది. తుండేనికి తుండెం, మొండేనికి మొండెం వేరైపోయినై.

"సీతాలూ" అని ఒక్క పొలికేక పెట్టాడు. సీతాలుమీద మట్టిమాత్రం లేదు. ఆ కట్టె; గోతిలో వికృతంగా కనిపించింది.

సిరిపురంబావ గుర్తొచ్చేడు. "బావా బావా!" అని పిలిచి మఱ్ఱిచెట్టు కిందకు పరుగెత్తుకు వెళ్ళి, బావను తట్టిలేపేడు. బావ లేడు. పట్టి దుప్పటి మాత్రం వుంది. అంతా అర్థం అయిపోయింది.

సిరిపురంబావకి సీతాలుమీద వల్లమాల్ని భ్రమ. సీతాలు బ్రతికిందో లేదోనని మట్టి తవ్వి చూస్తున్నాడు. పెద్దయ్యకి ఆ చీకట్లో అఘోరీలా కనుపించేడు. ఇప్పుడెంత ఘోరం జరిగిపోయింది. సిరిపురంబావ మొండేనికి ఈ తెగిపోయిన తల మగంటదు. తెల్లవారిపోయింది. సీతాలు సమాధినిండా రక్తం! సిరిపురంబొట్టెడి రక్తం!

పెద్దయ్య మతి మతిలోలేదు. సిరిపురం బొట్టెడిశవం సీతాలు ప్రక్కన వల్లకాట్లో వుంది. లోకం యావత్తూ విరగబడి చూసింది. శ్మశానంనిండా తీర్థప్రజ. ఏ నోట విన్నా ఆ మాటే.

అప్పటికీ యిప్పటికీ మతిలేని పెద్దయ్య ఎక్కడికి వెళ్ళాడో ఎవరికీ తెలీనేలేదు. ★

## దుబారా

ఆ ఇంగ్లీషు ఇల్లాలు మేడమీద కిటికీ దులుపుతూ ఉంది. కిటికీలోంచి ముందుకు వంగడంలో పట్టు తప్పి క్రింద పడిపోయింది. రోడ్డుప్రక్కనే చెత్త వేసే డబ్బాలో పడింది.

ఆ సమయంలో రోడ్డుమీద పోతూఉన్న చైనీసు పెద్దమనిషి ఆమెను చూచి ఇలా అన్నాడు: "ఇంగ్లీషువాళ్ళే అంత. దుబారా అధికం. లేకపోతే సులభంగా మరో పదేళ్ళు అయినా చాకిరీ చేయగల ఆడదాన్ని ఇలా పారేసుకుంటారా?"


